క్లుప్తంగా

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ ఇందిర

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం పశు వైద్య కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సేఫ్ వర్క్ ప్లేస్ – స్ట్రాంగ్ వర్క్ ఫోర్స్ అంశంపై మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇందిర మాట్లాడుతూ విధి నిర్వహణలో మహిళలు వేధింపులకు గురికాకుండా ప్రభుత్వం పోష్ చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. విధులు నిర్వహించే ప్రతి మహిళకు చట్టంపై అవగాహన ఉండాలని తెలిపారు. మంచి వాతావరణంలో మహిళలు విధులు నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రహదారి గోతులమయం



కలసపాడు బాలాజీ గ్రానైట్స్ షాపు వద్ద దెబ్బతిన్న రోడ్డు

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడు – పోరుమామిళ్ల ప్రధాన రహదారిలోని బాలాజీ గ్రానైట్స్ వద్ద రోడ్డు గుంతలమయమైంది. వర్షం వస్తే నీరు చేరడంతో గోతులు తెలియక వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నామమాత్రంగా గుంతలకు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల వర్షాలు కురిసి ఇలా రోడ్డుపై నీరు నిలిచింది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



సుధాకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

మైదుకూరు : వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నక్కా సుధాకర్‌ను బుధవారం వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ పరామర్శించారు. నక్కా సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఖాజీపేట మండలం నాగసానిపల్లెలోని తన స్వగృహంలో కోలుకుంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నేట్లపల్లె శివరాం, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్ తినడం మానుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జీసీడీఓ, ఉపాధ్యాయులు

కాశినాయన : పాఠశాలలో చదువుకొనే పిల్లలు జంక్ ఫుడ్ తినడం మానుకోవాలని జీసీడీఓ ఆరోగ్యమేరి తెలిపారు. మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ పాఠశాలలో పిల్లలే మన ఆస్తి, భవిష్యత్తు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు చిరు ధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూతో కూడిన పౌష్టికాహారం అందిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం జన విజ్ఞాన వేదిక ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీవీ.చంద్రశేఖర్‌ఆచారి, మెర్సీ రాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

పోరుమామిళ్ల : మండలంలోని గానుగపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్ డీఏలను వెంటనే ఇవ్వాలని, పీఆర్సీ, ఐఆర్ బకాయిలు ఇవ్వాలని కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు బి.సురేంద్రనాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మూల్యాంకన పుస్తకాలతో ఉపాధ్యాయులకు పనిభారం, ఒత్తిడి పెరిగిందన్నారు. 2003 డీఎస్‌ఈ వారికి ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీతారామిరెడ్డి, శ్రీను, సత్తార్, శేషారెడ్డి, రామసుబ్బయ్య, భూపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, జనార్దన్, కొండయ్య, రేణుక, చంద్రరాజశేఖర్ ఆచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం జిల్లా ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి పీవీ.రమణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, పోల్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ వేలం పాట ఎప్పుడు..?

- 22 నుంచి ప్రారంభం కానున్న దసరా ఉత్సవాలు
- ప్రతి ఏటా మున్సిపాలిటీకి రూ.కోట్ల ఆదాయం



ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం

ప్రొద్దుటూరు : పసిడిపురిలో దసరా ఉత్సవాలకు వేళయింది. ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఆలయ నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లకు సిద్ధమయ్యారు. అయితే ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించిన దసరా ఎగ్జిబిషన్ వేలంపాట ఎప్పుడు నిర్వహిస్తారనేది తెలియడం లేదు. ఈ ప్రభావం కారణంగా మున్సిపల్ ఆదాయానికి నష్టం వాటిల్లే పరిస్థితులున్నాయని సర్వత్రా చర్చ జరుగుతోంది. ఏటా ప్రొద్దుటూరు దసరా ఉత్సవాలను తిలకించేందుకు లక్షల సంఖ్యలో వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి ప్రజలు ఇక్కడికి తరలివస్తారు. పది రోజులపాటు జరిగే దసరా ఉత్సవాలకు రెండో మైసూరుగా గుర్తింపు ఉంది. ఈ సందర్భంగా ఏటా స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు ఏటా మున్సిపాలిటీ వసతులు కల్పిస్తోంది. వేలం పాడి దక్కించుకున్న కాంట్రాక్టర్ దీనిని నిర్వహిస్తారు. నెల రోజుల ముందుగా అధికారులు కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి అజెండాను ఆమోదించడం జరుగుతోంది. అయితే ఈ ఏడాది ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు లేవు.

గతంలో ఆదాయం ఇలా..

ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి 2024లో నిర్వహించిన వేలంపాటలో మున్సిపాలిటీకి రూ.1.75 కోట్లు, 2023లో రూ.1.17కోట్లు, 2022లో రూ.1.42 కోట్లు, 2021లో రూ.కోటి ఆదాయం లభించింది. 2020లో కరోనా ప్రభావం కారణంగా వేలంపాట జరగలేదు. ఇదిలా ఉండగా ఈ ఏడాది దసరా ఉత్సవాలు సమీపిస్తున్నా ఇంతవరకూ వేలం పాట నిర్వహించలేదు.. సరికదా కనీసం కౌన్సిల్ సమావేశం జరగలేదు. సాధారణంగా ప్రతినెలా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిపాలన గాడి తప్పింది. ఇష్టం వచ్చిన రీతిలో కౌన్సిల్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఎగ్జిబిషన్ వేలం పాట పరిస్థితి ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డిని సాక్షి వివరణ కోరగా ఎగ్జిబిషన్ వేలంపాట నిర్వహణలో ఆలస్యమైన మాట వాస్తవమేనన్నారు. ప్రత్యేక తరహాలో అనుమతి తీసుకునేందుకు మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవికి లేఖ రాశామన్నారు. అనుమతి వస్తూనే అవసరమైతే ఇంటింటా తెలిసేలా ఆటో ఏర్పాటు చేసి ప్రచారం కల్పించి వేలం పాట నిర్వహిస్తామన్నారు.

వ్యవసాయ బోర్లకు ఉదయం 11 గంటల వరకే విద్యుత్ సరఫరా

మైదుకూరు : మైదుకూరు, ఖాజీపేట మండలాల్లోని పలు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో గురువారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ఉదయం 11 గంటల వరకే వ్యవసాయ బోర్లకు విద్యుత్ సరఫరా ఉంటుందని మైదుకూరు ట్రాన్స్‌కో విద్యుత్ సబ్ డివిజనల్ అధికారి శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఫీడర్ల కింద లైటింగ్ సౌకర్యం కల్పించేందుకు 24 గంటల విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తున్న కారణంగా వినియోగదారులకు ఈ అసౌకర్యం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. మైదుకూరు సెక్షన్‌లోని నంద్యాలంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని కరుణగిరి, గాంధీనగర్, కృష్ణగోపులాపురం ఫీడర్లు, ఉప్పగుంటపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని కట్టకిందపల్లె, సుంకులుగారిపల్లె, ఎస్.ఎర్రబల్లె ఫీడర్లలో వ్యవసాయ బోర్లకు ఉదయం 11 గంటల వరకే విద్యుత్ సరఫరా ఉంటుందని ట్రాన్స్‌కో అధికారి శ్రీకాంత్ తెలిపారు. వనిపెంట సెక్షన్‌లోని లెక్కలవారిపల్లె సబ్ స్టేషన్ పరిధిలో నల్లపురెడ్డిపల్లె, ఉత్సలవరం, గంజికుంట ఫీడర్లు, వనిపెంట సబ్‌స్టేషన పరిధిలోని వనిపెంట రూరల్, జంగంపల్లె, లెక్కలవారిపల్లె, ఆదిరెడ్డిపల్లె, పప్పునపల్లె ఫీడర్లు, ఖాజీపేట మండలం ఖాజీపేట సెక్షన్‌లోని నాగసానిపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని జయరాంపేట, నాగసానిపల్లె ఫీడర్ కింద ఉన్న గ్రామాల వ్యవసాయ బోర్లకు ఉదయం 11 గంటల వరకు మాత్రమే 3 ఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు. ఆయా ఫీడర్ల పరిధిలో 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

10 నుంచి యోగా శిక్షణ తరగతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు 'ఇన్నర్ ఇంజనీరింగ్' పేరుతో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కడప తిరుపతి రోడ్డులోని కెమిస్ట్ భవన్‌లో రోజూ ఉదయం, సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటలకు వరకు, ఆదివారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు ఈ శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు. 10వ తేదీన పరిచయ కార్యక్రమం ఉంటుందని, మరిన్ని వివరాలకు 9381214456, 9494899510 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

బార్ ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీకి ఒక బార్‌రెస్టారెంట్‌ను మంజూరు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసిందని ఎక్సైజ్ సీఐ ధీరజ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బార్ రెస్టారెంట్‌ను నడిపేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు మైదుకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లలో సంప్రదించాలని సూచించారు.

రాయలసీమ అభివృద్ధే లక్ష్యంగా పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఓబయ్య

బద్వేలు అర్బన్ : రాయలసీమ అభివృద్ధే లక్ష్యంగా పోరాటం సాగిస్తామని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి బందెల ఓబయ్య అన్నారు. స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి, నిరుద్యోగ సమస్య, పరిశ్రమల ఏర్పాటు వంటి సమస్యలతోపాటు ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు చేయాలని కోరుతూ ఉద్యమం రూపొందిస్తామని తెలిపారు. అమరావతి, పోలవరానికి నిధులు కేటాయించి రాయలసీమ ప్రజలపైసవతి తల్లి ప్రేమ చూపిస్తోందన్నారు. ఈ నెల 24న అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో జరిగే రాయలసీమ విస్తృత స్థాయి సమావేశాల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్.చంద్రశేఖర్, జకరయ్య, రామరాజు, బాబు, విజయరావు, నారాయణ, చంద్రపాల్, పాండు, చెన్నయ్య, చంద్రయ్య, పోలయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

అట్లూరు : ప్రజల సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని మండల అధ్యక్షురాలు రమాదేవి, మండల అభివృద్ధి అధికారి వెంగమునిరెడ్డి కోరారు. స్థానిక స్త్రీశక్తి సభా భవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా శాఖల వారీగా అధికారులు చేపట్టిన, చేపట్టబోయే పనులపై వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విష జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు దోమల నివారణా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రాజవోలు సుబ్బారెడ్డి, మహబూబ్‌బాషా, అధికారులు భాస్కర్‌బాబు, రామకృష్ణయ్య, హమీదాబేగం, సురేష్, జయచంద్ర, శ్రీనివాసులు, ఈశ్వర ప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి మిలాద్ ఉన్ నబీ వేడుకలు

కమలాపురం : దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాతి గాంచిన కమలాపురంలోని దర్గా–ఏ–గఫారియాలో ఈనెల 4వ తేదీన సాయంత్రం మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ, దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమలాపురంలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దర్గా–ఏ–గఫారియాలో ప్రతి ఏటా ఆసారే షరీఫ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆసారే షరీఫ్ అంటే వందల ఏళ్ల క్రితం మహ్మద్ ప్రవక్త, ఆయన కుటుంబ సభ్యులు వాడిన 100కు పైగా వస్తువులను ప్రదర్శిస్తారన్నారు. ఈ వస్తువులను మక్కా, మదీన, బాగ్దాద్, ఈజిప్ట్, తుర్కి తదితర దేశాల నుంచి తెప్పించినట్లు ఆయన వివరించారు. ఈ వస్తువులను నేరుగా చూస్తే వారి కోరికలు నెరవేరుతాయన్నారు. అలాగే వారికి ఆయురారోగ్యాలు, సంతానం, ఉద్యోగాలు పొందుతారని భక్తులు విశ్వసిస్తారన్నారు. అదే రోజు రాత్రి భారీ ఎత్తున అన్నదానం, అనంతరం బయాన్ ఉంటుందన్నారు. 5వ తేదీన ఉదయం జెండా ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం మిలాద్ ఉన్ నబీ ప్రత్యేక దువా జరుగుతుందని, భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

8న కడపలో బహిరంగ సభ

అట్లూరు : కడప నగరంలో ఈ నెల 8, 9, 10వ తేదీలలో జరిగే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.చాంద్‌బాషా, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, దుర్గమ్మ తెలిపారు. మండలంలోని ఎస్.వెంకటాపురం గ్రామంలో బుధవారం జాతీయ సమావేశాల కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర నేతలు హాజరవుతారన్నారు. జిల్లా నలుమూలల నుంచి రైతులు, వ్యవసాయ కార్మికులు, కర్షకులు, మేధావులు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివ, నరసింహులు, మారయ్య, స్వప్న, ఆదిలక్ష్మమ్మ, సరస్వతి, అచ్చమ్మ, సుబ్బలక్ష్మమ్మ, గంగమ్మ, ఎల్లమ్మ, అయ్యవారమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

నూతన భవనంలో సొసైటీ సేవలు



నూతన భవనంలో పూజలు చేస్తున్న చైర్మన్, సభ్యులు

చాపాడు : అల్లాడుపల్లె రైతు సహకార సంఘం బ్యాంకు సేవలు నూతన భవనంలో అందుతాయని సొసైటీ చైర్మన్ మార్తల నరసింహారెడ్డి పేర్కొన్నారు. 1979లో నిర్మితమైన పాత భవనం శిథిలం కావడంతో బుధవారం సొసైటీని నూతన భవనంలోకి మార్చారు. సీఈఓ జాన్, సిబ్బంది, చైర్మన్ నరసింహారెడ్డి పూజలు నిర్వహించి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీకి ఎరువులను తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులు పంట రుణాలను సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, సుదర్శన్, గురివిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వేమారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, సలీం, సుబ్బరాయుడు, నారపురెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలం పాట నిర్వహించరేం..!

ప్రొద్దుటూరు : రాజుపాళెం మండలం పగిడాల గ్రామంలోని ఆలయ భూములకు వేలంపాట నిర్వహించేందుకు అధికారులు ఆసక్తికనపరచడంలేదు. ఈ కారణంగా దేవాదాయశాఖకు నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది.

పగిడాల ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, ఈశ్వరాయాలకు సంబంధించి 60 ఎకరాల మాన్యం భూములు ఉన్నాయి. రెండేళ్లకోమారు దేవాదాయ అధికారులు వేలంపాట నిర్వహించి సాగు దారుల నుంచి కౌలు వసూలుచేసేవారు. ఈ ప్రకారం సుమారు 30 ఎకరాల భూమికి ఈ ఏడాది జూలై 21న వేలంపాట నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన 27 ఎకరాల భూమి అర్చకుల పరిధిలో ఉండేది. ప్రస్తుతం ఇది దేవాదాయశాఖ పరిధిలోకి చేరింది. ఈ మేరకు ఈ ఏడాది జూలై 14న కోర్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీధర్‌ను సాక్షి వివరణ కోరగా తమకు ఆదేశాలందగానే వేలంపాట నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

అట్లూరు : పోరుమామిళ్ల సాయిబాబా గుడి వీధికి చెందిన పాదిలి చిన్న మహబూబ్‌బాషా గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి బుధవారం వారి స్వగృహానికి వెళ్లి మృతుడికి నివాళులర్పించారు. అలాగే మండలంలోని గిరి నగర్‌కు చెందిన బొప్పూరి రాజు మృతి చెందగా ఆయన పార్థివ దేహాన్ని ఎమ్మెల్సీ సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కల్లూరి రమణారెడ్డి, ముత్యాల ప్రసాద్, చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, తిమ్మారెడ్డి, రఘునాథరెడ్డి, ఇషాక్, రాజీవ్ బాషా, నరసింహులు, సిద్ధమూర్తి రాజారెడ్డి, మస్తాన్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు

చాపాడు : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మండల విద్యాశాఖాధికారులు రవి శంకర్, వంశీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, గ్రామస్థులకు స్థానిక హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ ఓటీపీలు షేర్ చేయడం గానీ, ఈకేవైసీ అని వచ్చే కాల్స్‌కు స్పందించరాదని తెలిపారు. ఆధార్ అప్‌డేట్ అంటూ ఫోన్‌లో అడిగే వారికి ఎలాంటి సమాచారం ఇవ్వరాదన్నారు. హెడ్ కోఆర్డినేటర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించుకోవాలని, పొదుపు సంఘాల మహిళలు ఇచ్చే బ్యాంకు రుణాలు పొంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే 1930 నెంబర్‌కు కాల్ చేసి వివరాలు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బొజ్జగణపయ్యా.. ఇక సెలవయ్యా..



నిమజ్జనానికి తరలిన నేతాజీనగర్ గణనాథుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయక చవితి పర్వదిన సందర్భంగా పలు ప్రాంతాల్లో కొలువైన గణనాథుని విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. నేతాజీ నగర్, వైఎంఆర్ కాలనీ, వసంతపేట, రామేశ్వరం తదితర ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం జరిపారు. అన్న ప్రసాద వితరణచేశారు. అనంతరం బాణసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాల సందడి మధ్య యువత నృత్యం చేస్తూ స్వామిని ఊరేగించారు. ఆపై కామనూరు, చాపాడు కుందూ నదిలో నిమజ్జనం చేశారు.

అధికారులు గైర్హాజరైతే.. ఎవరు సమాధానమిస్తారు?



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఎస్.పోలమ్మ

కాశినాయన : మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరైతే ప్రజాప్రతినిధులు అడిగే సమస్యలకు సమాధానాలు ఎవరు చెబుతారని ఎంపీపీ ఎస్.పోలమ్మ, జెడ్పీటీసీ డి.సత్యనారాయణరెడ్డి ప్రశ్నించారు. నరసాపురంలోని స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ ఎస్.పోలమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ తర్వాత జరగబోయే సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మైథిలికి సూచించారు. పలువురు సర్పంచ్‌లు ప్రజా సమస్యలపై, 15వ ఆర్థిక సంఘం నిధులపై, మధ్యలో ఆగిపోయిన రోడ్ల నిర్మాణాలపై, పెండింగ్ బిల్లులపై అధికారులను నిలదీశారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలు వస్తుంటాయని అధికారులు గైర్హాజరు కావడం ఏమిటని ప్రశ్నించారు. మండల స్థాయి అధికారులు వాటి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటసుబ్బయ్య ఆచారి, అధికారులు ముజఫర్‌రహీం, పుల్లయ్య, నిర్మల, డాక్టర్ పుష్ప, అశోక్‌కుమార్, రామారావు, చంద్రకళ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆర్థిక విధానాలతో వ్యవసాయ రంగం కుదేలు



విరాళాలు సేకరిస్తున్న కార్మిక సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : పాలకులు అవలంబిస్తున్న నూతన ఆర్థిక విధానాలతో వ్యవసాయ రంగం కుదేలు అవుతోందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ రాణి అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయ సభా భవనంలో నిర్వహించిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడుతూ ఈ నెల 8, 9, 10వ తేదీల్లో కడలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు జరగనున్నాయన్నారు. రైతుల ఆత్మహత్యలు, వ్యవసాయ కార్మికుల వలసలు పెద్ద ఎత్తున జరుగుతున్నా పాలకులు పరిష్కార మార్గం చూపకపోవడం దారుణమన్నారు. జాతీయ సమావేశాల్లో వ్యవసాయ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో వెంకటేష్, దుర్గమ్మ, లావణ్య, సరస్వతి, విజయమ్మ, స్వప్న, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ : కడప నగరంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు కె.శ్రీనివాసులు కోరారు. పట్టణంలో బుధవారం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్ని, కొండయ్య, సుబ్బరాయుడు, మోక్షమ్మ, బాబు, శివ, ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికుల వినతి



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రొద్దుటూరు క్రైం : మూడు నెలలుగా కాంట్రాక్టర్ తమకు వేతనాలు ఇవ్వడంలేదని, తగు చర్యలు తీసుకొని ఇప్పించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ కోరారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రూపానంద్‌కు బుధవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలోని పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెలా ఐదో తేదీ నాటికి వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా, మూడు నెలలుగా కాలయాపన చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ప్రతిసారీ నెల జీతం ఇస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మూడు నెలల జీతాన్ని ఇప్పించే ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మెలకువలను పాటిస్తే అధిక దిగుబడులు



సావిశెట్టిపల్లెలో ఉల్లి పంటను పరిశీలిస్తున్న రవిచంద్రబాబు

కాశినాయన : ఉల్లి పంటలో మెలకువలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు అన్నారు. మండలంలోని సావిశెట్టిపల్లెలో రైతులు సాగు చేసిన ఉల్లి పంటను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 14వేల ఎకరాల్లో రైతులు ఉల్లి పంట సాగు చేస్తున్నారన్నారు. ఎగుమతి ఆధారిత కేపీ ఉల్లితోపాటు పెద్ద బళ్లారి, చిన్న బళ్లారి రకాలు సాగులో ఉన్నాయన్నారు. పంట సాగు చేసే సమయంలో విత్తన ఎంపిక ప్రధానమైందని, సంకర జాతి రకాలను ఎన్నుకుని బిందు సేద్యం ద్వారా సాగుచేస్తే అధిక దిగుబడితో పాటు గడ్డ నాణ్యత పెరుగుతుందన్నారు. రైతులు పొలాల్లోనే పంటను అమ్ముకుని ఆర్థికంగా నష్టపోవడం జరుగుతోందని, రైతులు గోదాములు నిర్మించుకుంటే ఉద్యాన శాఖ 50 శాతం రాయితీ అందిస్తోందన్నారు. యూనిట్ ధర రూ.లక్షా 75 వేలు కాగా, రైతు వాటా రూ.87,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో గోదాములో 25 టన్నుల ఉల్లిని నిల్వ ఉంచు కోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి శ్రీనివాసులురెడ్డి, సురేందర్, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు చంద్రశేఖర్, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

దోమ కాటు.. ప్రజల ఆరోగ్యానికి చేటు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సతీష్

పులివెందుల రూరల్ : దోమకాటు ఆరోగ్యానికి చేటు అని, ప్రతి ఒక్కరూ దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొద్దీన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక మినీ సచివాలయంలో సీజనల్ వ్యాధులపై ఆరోగ్య కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రతి రోజు మీకు కేటాయించిన గృహాలలో ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించాలని, ఎవరికైనా జ్వరం ఉన్నట్లయితే వెంటనే రక్త పరీక్ష చేయాలన్నారు. అనారోగ్యంతో ఎవరైనా బాధపడుతుంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి మాత్రమే వెళ్లాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో దోమల ఉధృతి అధికంగా ఉంటుందని, నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శాంతికుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, ఆరోగ్య విస్తరణాధికారి సతీష్ కుమార్, వైద్య, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన పెంచాలి



మాట్లాడుతున్న ప్రాజెక్ట్ మేనేజర్ సరేష్‌కుమార్

ప్రొద్దుటూరు క్రైం : హెచ్‌ఐవీపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. చైతన్య ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజబాటవీధి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి ప్రజలకు తెలియాలన్నారు. న్యాకో నేతృత్వంలో రెండు నెలల పాటు రాష్ట్రస్థాయి క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఐవీ ఉన్న వారిపై వివక్ష తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు తద్వారా ఎక్కువమంది పరీక్షలు చేయించుకునేలా చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, శివజ్యోతి, విజయలక్ష్మి, ఝాన్సీ, ప్రసాద్, మల్లేశ్వరి, సరస్వతి, కవిత, చైతన్య సొసైటీ సిబ్బంది పుల్లయ్య, భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరకే యూరియా విక్రయించాలి

ముద్దనూరు: ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.266.50లకే యూరియా బస్తాను విక్రయించాలని, రైతులకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ ఎం.శివన్న, ఏఓ మురళీకృష్ణలు హెచ్చరించారు. బుధవారం మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డితో కలిసి వారు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్ నమోదు చేయాలని సూచించారు.